22-01-2024 ప్రాత:మురళి ఓంశాంతి ''బాప్ దాదా'' మధువనం

"మధురమైన పిల్లలూ - మీరు సంపూర్ణ పావనముగా అవ్వాలి, అందుకే ఎప్పుడూ ఎవరికీ దుఃఖమునివ్వకండి, కర్మేంద్రియాలతో ఏ వికర్మలూ జరగకూడదు, సదా తండ్రి ఆజ్ఞానుసారముగా నడుస్తూ ఉండండి"

ప్రశ్న:- రాయి నుండి పారసముగా తయారయ్యేందుకు యుక్తి ఏమిటి? ఏ వ్యాధి ఇందులో విఘ్నరూపముగా అవుతుంది?

జవాబు:- రాయి నుండి పారసముగా తయారయ్యేందుకు పూర్తి నారాయణీ నషా కావాలి. దేహాభిమానము తొలగిపోవాలి. ఈ దేహాభిమానమే కఠినాతి కఠినమైన వ్యాధి. ఎప్పటివరకైతే దేహీ-అభిమానులుగా అవ్వరో అప్పటివరకూ పారసముగా అవ్వలేరు. పారసముగా అయ్యేవారే తండ్రికి సహాయకులుగా అవ్వగలుగుతారు. 2. సేవ కూడా మీ బుద్ధిని స్వర్ణిమముగా తయారుచేస్తుంది. దీని కొరకు చదువుపై పూర్తి ధ్యానము ఉండాలి.

ఓం శాంతి. ఆత్మిక పిల్లలను ఆత్మిక తండ్రి సావధానపరుస్తున్నారు - పిల్లలూ, మీరు స్వయాన్ని సంగమయుగమువారిగా భావించండి. సత్యయుగమువారిగానైతే భావించరు. బ్రాహ్మణులైన మీరే స్వయాన్ని సంగమయుగమువారిగా భావిస్తారు. మిగిలినవారంతా స్వయాన్ని కలియుగమువారిగా భావిస్తారు. సత్యయుగానికి మరియు కలియుగానికి, స్వర్గవాసులకు మరియు నరకవాసులకు చాలా తేడా ఉంది. మీరైతే స్వర్గవాసులూ కారు, నరకవాసులూ కారు. మీరు పురుషోత్తమ సంగమయుగవాసులు. ఈ సంగమయుగము గురించి బ్రాహ్మణులైన మీకే తెలుసు, ఇంకెవ్వరికీ తెలియదు. మీకు తెలిసినా కానీ మర్చిపోతారు. ఇప్పుడు మనుష్యులకు ఎలా అర్థం చేయించాలి. వారైతే రావణుని సంకెళ్ళలో చిక్కుకొని ఉన్నారు. రామ రాజ్యమైతే లేనే లేదు. రావణుడిని కాలుస్తూ ఉంటారు, దీని ద్వారా ఇది రావణరాజ్యమని నిరూపించబడుతుంది. రామ రాజ్యమంటే ఏమిటి మరియు రావణ రాజ్యమంటే ఏమిటి, ఇది కూడా మీరు నంబరువారుగా అర్థం చేసుకోగలుగుతారు. తండ్రి వచ్చేదే సంగమయుగములో కావున సత్యయుగాన్ని మరియు కలియుగాన్ని పోల్చడం కూడా ఇక్కడే జరుగుతుంది. కలియుగములో ఉండేవారిని నరకవాసులని, సత్యయుగములో ఉండేవారిని స్వర్గవాసులని అంటారు. స్వర్గవాసులను పావనులని, నరకవాసులను పతితులని అంటారు. మీ విషయమే అతీతమైనది. మీకు ఈ పురుషోత్తమ సంగమయుగము గురించి తెలుసు. మేము బ్రాహ్మణులమని మీరు భావిస్తారు. వర్ణాల చిత్రము కూడా చాలా బాగుంది. దీనిపై కూడా మీరు అర్థం చేయించవచ్చు. తేడాను తెలియజేయాలి, తద్వారా మనుష్యులు తమను తాము నరకవాసులుగా, పతితులుగా, నిరుపేదలుగా ఉన్నామని అర్థం చేసుకుంటారు. ఇలా వ్రాయాలి - ఇప్పుడు ఇది పాత కలియుగ ప్రపంచము, సత్యయుగీ స్వర్గము కొత్త ప్రపంచము, మరి మీరు నరకవాసులా లేక స్వర్గవాసులా? మీరు దేవతలా లేక అసురులా? మేము స్వర్గవాసులము అనైతే ఎవ్వరూ అనరు. కొంతమంది మేమైతే స్వర్గములో కూర్చున్నామని భావిస్తారు. అరే, ఇదైతే నరకము కదా. ఇందులో సత్యయుగము ఎక్కడ ఉంది? ఇది రావణ రాజ్యం, కావుననే రావణుడిని కాలుస్తారు. వారి వద్ద కూడా ఎన్ని జవాబులు ఉంటాయి. సర్వవ్యాపి అన్న విషయంపై కూడా ఎన్ని వాదనలు చేస్తారు. పిల్లలైన మీరైతే స్పష్టంగా అడుగుతారు - ఇప్పుడు ఇది కొత్త ప్రపంచమా లేక పాత ప్రపంచమా. ఈ విధంగా స్పష్టంగా తేడాను తెలియజేయాలి, ఇందులో చాలా తెలివి కావాలి. ఎంత యుక్తిగా వ్రాయాలంటే తద్వారా మనుష్యులు స్వయాన్ని ప్రశ్నించుకోవాలి - నేను నరకవాసినా లేక స్వర్గవాసినా? ఇది పాత ప్రపంచమా లేక కొత్త ప్రపంచమా? ఇది రామ రాజ్యమా లేదా రావణ రాజ్యమా? మేము పాత కలియుగ ప్రపంచవాసులమా లేక కొత్త ప్రపంచవాసులమా? హిందీలో వ్రాసి ఆ తరువాత ఇంగ్లీషులోకి, గుజరాతీలోకి అనువాదం చేయాలి. తద్వారా మనుష్యులు తాము ఎక్కడి నివాసులము అన్నది స్వయాన్ని ప్రశ్నించుకోవాలి. ఎవరైనా శరీరాన్ని విడిచిపెట్టినప్పుడు స్వర్గస్థులయ్యారు అని అంటారు, కానీ స్వర్గము ఇప్పుడు ఎక్కడ ఉంది? ఇప్పుడైతే కలియుగము ఉంది. తప్పకుండా పునర్జన్మలు కూడా ఇక్కడే తీసుకుంటారు కదా. స్వర్గము అని సత్యయుగాన్ని అంటారు, అక్కడకు ఇప్పుడు ఎలా వెళ్తారు? ఇవన్నీ విచార సాగర మంథనము చేయాల్సిన విషయాలు. ఎంతో స్పష్టముగా తేడాను చూపించాలి, అందులో ఇలా వ్రాయండి - భగవానువాచ, ప్రతి ఒక్కరూ స్వయాన్ని ప్రశ్నించుకోండి, నేను సత్యయుగీ రామ రాజ్య నివాసినా లేక కలియుగీ రావణ రాజ్య నివాసినా? బ్రాహ్మణులైన మీరు సంగమయుగవాసులు, మీ గురించైతే ఎవరికీ తెలియనే తెలియదు. మీరు అందరికన్నా అతీతమైనవారు. మీకు సత్యయుగము, కలియుగము గురించి యథార్థముగా తెలుసు. మీరు వికారీ భ్రష్టాచారులా లేక నిర్వికారీ శ్రేష్ఠాచారులా? అని మీరే ప్రశ్నించగలుగుతారు. మీరు ఇది పుస్తకముగా కూడా తయారుచెయ్యవచ్చు.

కొత్త-కొత్త విషయాలను తీయాల్సి ఉంటుంది కదా, తద్వారా మనుష్యులు ఈశ్వరుడు సర్వవ్యాపి కాదు అని అర్థం చేసుకోగలగాలి. మీరు వ్రాసినదానిని చూసి తమకు తామే లోలోపల ప్రశ్నించుకుంటారు. దీనిని ఐరన్ ఏజ్ (ఇనుపయుగము) అని అందరూ అంటారు. దీనిని సత్యయుగీ దైవీ రాజ్యం అని ఎవరూ అనలేరు. ఇది నరకమా లేక స్వర్గమా. ఎంత ఫస్ట్ క్లాస్ గా వివరం వ్రాయండంటే, మనుష్యులు స్వయాన్ని - మేము తప్పకుండా నరకవాసీ పతితులమని, మాలో దైవీ గుణాలైతే లేనే లేవు అని అర్థం చేసుకోవాలి. కలియుగములో సత్యయుగము వారు ఎవ్వరూ ఉండలేరు. ఈ విధంగా విచార సాగర మంథనము చేసి వ్రాయాలి. ఎవరైతే తమకు తాముగా ముందుకు వచ్చి సేవా బాధ్యతను తీసుకుంటారో వారే అర్జునులు... గీతలో అర్జునుడి పేరును వ్రాసారు.

బాబా అంటారు - ఈ గీత ఏదైతే ఉందో, ఇది పిండిలో ఉప్పు ఉన్నంత మాత్రమే ఉంది. ఉప్పు మరియు పంచదారలో ఎంత తేడా ఉంది... ఇది తీపిగా, అది ఉప్పగా ఉంటుంది. శ్రీకృష్ణ భగవానువాచ అని వ్రాసి గీతను ఉప్పగా చేసేసారు. మనుష్యులు ఎంతగా ఊబిలో చిక్కుకుపోతారు. పాపం వారికి జ్ఞానం యొక్క రహస్యం గురించి కూడా తెలియదు, జ్ఞానాన్ని భగవంతుడు మీకు మాత్రమే వినిపిస్తారు, దీని గురించి ఇంకెవ్వరికీ తెలియను కూడా తెలియదు. జ్ఞానమైతే చాలా సహజమైనది. కానీ భగవంతుడు చదివిస్తున్నారు అన్నది మర్చిపోతారు. టీచరునే మర్చిపోతారు. లేదంటే విద్యార్థులు ఎప్పుడూ టీచరును మర్చిపోరు. బాబా, మేము మిమ్మల్ని మర్చిపోతున్నాము అని ఘడియ-ఘడియ అంటారు. బాబా అంటారు, మాయ తక్కువేమీ కాదు. మీరు దేహాభిమానులుగా అయిపోతారు, ఎన్నో వికర్మలు తయారవుతాయి. ఆ విధంగా వికర్మలు జరగని రోజంటూ ఏదీ లేదు. మీరు చేసే ఒక ముఖ్యమైన వికర్మ ఏమిటంటే - తండ్రి ఆజ్ఞనే మర్చిపోతారు. తండ్రి ఆజ్ఞ ఇస్తున్నారు - మన్మనాభవ, స్వయాన్ని ఆత్మగా భావించండి. ఈ ఆజ్ఞను పాటించకపోతే తప్పకుండా వికర్మయే జరుగుతుంది. చాలా పాపాలు జరుగుతాయి. తండ్రి ఆజ్ఞ చాలా సహజమైనది కూడా, అలాగే చాలా కఠినమైనది కూడా. ఎంత కష్టపడినా కానీ మళ్ళీ మర్చిపోతారు ఎందుకంటే అర్ధకల్పపు దేహాభిమానం ఉంది కదా. 5 నిముషాలు కూడా యథార్థ రీతిగా స్మృతిలో కూర్చోలేరు. ఒకవేళ రోజంతా స్మృతిలో ఉన్నట్లయితే ఇక కర్మాతీత అవస్థ ఏర్పడిపోతుంది. తండ్రి అర్థం చేయించారు - ఇందులో శ్రమ ఉంది. మీరు ఆ దైహికమైన చదువునైతే బాగా చదువుతారు. చరిత్ర మరియు భూగోళముల గురించి చదివే అభ్యాసము ఎంతగా ఉంటుంది. కానీ స్మృతి యాత్ర యొక్క అభ్యాసము అస్సలు లేదు. స్వయాన్ని ఆత్మగా భావిస్తూ తండ్రిని స్మృతి చేయడము - ఇది కొత్త విషయము. ఇటువంటి తండ్రినైతే చాలా బాగా స్మృతి చేయాలని వివేకం చెప్తుంది. ఎంతోకొంత సమయం తీసి రొట్టె ముక్కను తింటారు, అది కూడా బాబా స్మృతిలో తినాలి. ఎంతగా స్మృతిలో ఉంటారో అంతగా పావనులుగా అవుతారు. ఎంతోమంది పిల్లలు ఎలా ఉన్నారంటే, వారి వద్ద వడ్డీ లభిస్తూ ఉండే విధంగా ఎంతో ధనం ఉంది. తండ్రిని స్మృతి చేసుకుంటూ, తినడానికి ఒక రొట్టెముక్క ఉంటే చాలు. కానీ మాయ స్మృతి చెయ్యనివ్వదు. కల్పపూర్వము ఎవరు ఎంత పురుషార్థము చేసారో అంతే చేస్తారు. సమయం పడుతుంది. ఎవరైనా తొందరగా పరిగెత్తి చేరుకోవడమనేది జరుగదు. ఇందులోనైతే ఇద్దరు తండ్రులు ఉన్నారు. అనంతమైన తండ్రికి తమదంటూ శరీరము లేదు. వారు వీరిలోకి ప్రవేశించి మాట్లాడుతారు. కావున తండ్రి శ్రీమతముపై నడవాలి. తండ్రి పిల్లలకు ఈ శ్రీమతాన్ని ఇస్తున్నారు - దేహ సహితంగా సర్వ ధర్మాలను వదిలి స్వయాన్ని ఆత్మగా భావించండి. మీరు పవిత్రముగా వచ్చారు, 84 జన్మలు తీసుకుంటూ-తీసుకుంటూ మీ ఆత్మ పతితముగా అయ్యింది. ఇప్పుడు పావనంగా అయ్యేందుకు శ్రీమతముపై నడవండి, అప్పుడు తండ్రి గ్యారంటీ ఇస్తున్నారు - మీ పాపాలు కట్ అయిపోతాయి, మీ ఆత్మ స్వర్ణిమముగా అవుతుంది, మళ్ళీ అక్కడ దేహము కూడా స్వర్ణిమమైనది లభిస్తుంది. ఎవరైతే ఈ కులానికి చెందినవారై ఉంటారో వారు మీరు చెప్పే విషయాలను విని ఆలోచనలో పడతారు, మీరు చెప్పే విషయాలు సరైనవి అని అంటారు. పావనంగా అవ్వాలంటే ఎవరికీ దుఃఖాన్ని ఇవ్వకూడదు. మనసా, వాచా, కర్మణా పవిత్రముగా అవ్వాలి. మనస్సులో తుఫానులు వస్తాయి. మీరు అనంతమైన రాజ్యాధికారాన్ని తీసుకుంటారు కదా, మీరు సత్యం చెప్పినా, చెప్పకపోయినా కానీ తండ్రి స్వయంగా చెప్తున్నారు - మాయ యొక్క అనేక వికల్పాలు వస్తాయి, కానీ కర్మేంద్రియాలతో ఎప్పుడూ వికర్మలు చేయకూడదు. కర్మేంద్రియాలతో ఎప్పుడూ పాపాలు చేయకూడదు.

ఈ తేడాను తెలియపరిచే విషయాలను మంచి రీతిలో వ్రాయాలి. శ్రీకృష్ణుడు పూర్తి 84 జన్మలను తీసుకుంటారు మరియు శివుడు పునర్జన్మలను తీసుకోరు. అతను సర్వ గుణ సంపన్నుడైన దేవత, వీరేమో తండ్రి. పాండవుల చిత్రాలను ఎంత పెద్ద-పెద్దగా తయారుచేసారో మీరు చూసారు. దీని అర్థమేమిటంటే - వారు అంతటి పెద్ద విశాలమైన బుద్ధి కలవారు అని. వారి బుద్ధి పెద్దగా ఉండేది, అందుకు బదులుగా వారు శరీరాన్ని పెద్దగా చేసేసారు. మీ వంటి విశాలమైన బుద్ధి ఇంకెవ్వరికీ ఉండదు. మీది ఈశ్వరీయ బుద్ధి. భక్తిలో ఎన్ని పెద్ద-పెద్ద చిత్రాలను తయారుచేసి తమ

ధనాన్ని నష్టపరచుకుంటూ ఉంటారు. ఎన్ని వేదాలు, శాస్త్రాలు, ఉపనిషత్తులను తయారుచేసి ఎంత ఖర్చు చేసారు. తండ్రి అంటారు, మీరు ఎంత ధనాన్ని పోగొడుతూ వచ్చారు. అనంతమైన తండ్రి ఫిర్యాదు చేస్తున్నారు. బాబా ఎంతో ధనాన్ని ఇచ్చారని, రాజయోగాన్ని నేర్పించి రాజులకే రాజులుగా తయారుచేసారని మీరు ఫీల్ అవుతారు. వారు భౌతికమైన చదువును చదివి బ్యారిస్టర్ మొదలైనవారిగా అవుతారు, తర్వాత దాని ద్వారా సంపాదన జరుగుతుంది, అందుకే నాలెడ్జ్ ఈజ్ సోర్స్ ఆఫ్ ఇన్కమ్ (జ్ఞానము సంపాదనకు ఆధారము) అని అంటారు. ఈ ఈశ్వరీయ చదువు కూడా సంపాదనకు ఆధారము, దీని ద్వారా అనంతమైన రాజ్యాధికారము లభిస్తుంది. భాగవతము, రామాయణము మొదలైనవాటిలో జ్ఞానమేమీ లేదు. అక్కడ లక్ష్యము-ఉద్దేశ్యము అంటూ ఏమీ లేదు. జ్ఞాన స్వరూపుడైన తండ్రి ఎవరైతే ఉన్నారో వారు కూర్చొని పిల్లలైన మీకు అర్థం చేయిస్తారు. ఇది పూర్తిగా కొత్త చదువు. దీనిని కూడా ఎవరు చదివిస్తున్నారు? భగవంతుడు. వారు కొత్త ప్రపంచానికి యజమానులుగా తయారుచేయడానికి చదివిస్తున్నారు. ఈ లక్ష్మీ-నారాయణులు ఈ చదువు ద్వారా ఉన్నత పదవిని పొందారు. రాజ్యాధికారము ఎక్కడ, ప్రజలు ఎక్కడ. ఎవరి భాగ్యమైనా తెరుచుకుంటే వారి నావ తీరాన్ని చేరుకుంటుంది. విద్యార్థులు తాము చదువుకుంటున్నారా మరియు ఇతరులకు చదివించగలరా లేదా అన్నది అర్థం చేసుకోగలరు. చదువుపై పూర్తి అటెన్షన్ ఉంచాలి. రాతిబుద్ధి కలవారిగా ఉన్న కారణముగా ఏమీ అర్థం చేసుకోరు. మీరు స్వర్ణిమబుద్ధి కలవారిగా అవ్వాలి. ఎవరైతే సేవలో ఉంటారో వారి బుద్ధే ఆ విధముగా అవుతుంది. అనంతమైన తండ్రి నుండి అనంతమైన వారసత్వాన్ని తీసుకోండి అని బ్యాడ్జ్‌పై కూడా ఎవరికైనా అర్థం చేయించవచ్చు. భారత్ స్వర్గముగా ఉండేది కదా. ఇది నిన్నటి విషయము. 5,000 సంవత్సరాల విషయం ఎక్కడ, లక్షలాది సంవత్సరాల విషయం ఎక్కడ. ఎంత తేడా ఉంది. మీరు అర్థం చేయించినా కానీ అర్థం చేసుకోరు, పూర్తిగా రాతిబుద్ధి కలవారిలా ఉన్నారు. ఈ బ్యాడ్జ్ మీ కొరకు ఒక గీత వంటిది, ఇందులో మొత్తం చదువు అంతా ఉంది. మనుష్యులకైతే భక్తి మార్గపు గీతయే గుర్తుంటుంది. ఇప్పుడు మీరు తండ్రి ద్వారా ఏ గీతనైతే వింటారో, దాని ద్వారా మీరు 21 జన్మల కొరకు సద్గతిని పొందుతారు. ప్రారంభములో మీరే గీతను చదివారు. పూజను కూడా మీరే ప్రారంభించారు. ఇప్పుడు పురుషార్థము చేసి ఆ పేదలను భక్తి మార్గపు సంకెళ్ళ నుండి విడిపించాలి. ఎవరో ఒకరికి అర్థం చేయిస్తూ ఉండండి. అందులో నుండి ఒకరిద్దరు వెలువడుతారు. ఎవరైనా 5, 6 మంది కలిసి వస్తే ప్రయత్నించి వేర్వేరుగా ఫారంలను నింపించి, వేర్వేరుగా అర్థం చేయించాలి. లేకపోతే వారిలో ఒక్కరు మంచిగా లేకపోయినా ఇతరులను పాడు చేసేస్తారు. ఫారంలనైతే తప్పకుండా వేర్వేరుగా నింపించండి. ఒకరి ఫారంను ఒకరు చూడకూడదు కూడా, అప్పుడు వారు అర్థం చేసుకోగలుగుతారు. ఈ యుక్తులన్నీ కావాలి, అప్పుడే మీరు విజయవంతులుగా అవుతూ ఉంటారు.

తండ్రి కూడా వ్యాపారియే. ఎవరైతే చురుకైనవారిగా ఉంటారో వారు వ్యాపారం మంచిగా చేస్తారు. తండ్రి ఎంతగా లాభంలోకి తీసుకువెళ్తారు. ఎవరైనా గుంపుగా కలిసి వస్తే ఫారంను వేర్వేరుగా నింపాలి అని చెప్పండి. ఒకవేళ అందరూ ధార్మిక మనస్కులైనట్లయితే అందరినీ కలిపి కూర్చోబెట్టి అడగాలి - మీరు గీతను చదివారా? దేవతలను నమ్ముతారా? బాబా అన్నారు - భక్తులకే వినిపించాలి. నా భక్తులు మరియు దేవతల భక్తులు ఈ విషయాలను త్వరగా అర్థం చేసుకుంటారు. రాతిని పారసముగా తయారుచేయడమనేది సామాన్యమైన విషయమేమీ కాదు. దేహాభిమానము కఠినాతి కఠినమైన చాలా అశుద్ధమైన వ్యాధి. ఎప్పటివరకైతే దేహాభిమానము సమాప్తమవ్వదో అప్పటివరకు బాగుపడడం చాలా కష్టము. ఇందులోనైతే పూర్తి నారాయణీ నషా కావాలి. మనము అశరీరులుగా వచ్చాము, అశరీరులుగా అయి వెళ్ళాలి. అసలు ఇక్కడ ఏముంది. తండ్రి అన్నారు - నన్ను స్మృతి చేయండి. ఇందులోనే శ్రమ ఉంది, ఇది చాలా పెద్ద గమ్యము. వీరు కల్పపూర్వము వలె మంచి సహాయకులుగా అవుతారు అని వారి నడవడిక ద్వారా తెలుస్తుంది. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. మనసా, వాచా, కర్మణా పవిత్రముగా ఉండాలి. కర్మేంద్రియాల ద్వారా ఏ వికర్మ జరగకూడదు - ఈ విషయములో సంభాళించుకోవాలి. ఆత్మను కాంచనముగా తయారుచేసుకునేందుకు స్మృతిలో తప్పకుండా ఉండాలి.

2. దేహాభిమానపు కఠినమైన వ్యాధి నుండి విముక్తులయ్యేందుకు నారాయణీ నషాలో ఉండాలి. అభ్యాసము చేయండి -

నేను అశరీరిగా వచ్చాను, ఇప్పుడు అశరీరిగా అయి తిరిగి వెళ్ళాలి.

వరదానము:- యోగము చేసే మరియు చేయించే యోగ్యతతోపాటు ప్రయోగీ ఆత్మా భవ

బాప్ దాదా చూసారు - పిల్లలు యోగము చెయ్యటము మరియు చేయించటము, రెండింటిలోనూ చురుకుగా ఉన్నారు. కావున ఏ విధంగా యోగము చెయ్యటము మరియు చేయించటములో యోగ్యులుగా ఉన్నారో, అలా ప్రయోగము చెయ్యటములో యోగ్యులుగా అవ్వండి మరియు తయారుచెయ్యండి. ఇప్పుడు ప్రయోగీ జీవితము యొక్క ఆవశ్యకత ఉంది. అన్నింటికంటే ముందుగా చెక్ చేసుకోండి - మీ సంస్కారాల పరివర్తనలో ఎంతవరకు ప్రయోగిగా అయ్యారు? ఎందుకంటే శ్రేష్ఠ సంస్కారాలే శ్రేష్ఠ ప్రపంచపు రచనకు పునాది. ఒకవేళ పునాది దృఢంగా ఉన్నట్లయితే మిగిలిన అన్ని విషయాలు స్వతహాగానే దృఢంగా ఉంటాయి.

స్లోగన్:- అనుభవీ ఆత్మలు ఎప్పుడూ వాయుమండలము లేక సాంగత్యపు రంగులోకి రాలేరు.

అవ్యక్తి సైలెన్స్ ద్వారా డబుల్ లైట్ ఫరిశ్తా స్థితిని అనుభవము చెయ్యండి

సంకల్పాలలో దృఢత ఉన్నప్పుడు మరియు స్థితిలో డబుల్ లైట్ తనము ఉన్నప్పుడు సదా సంతోషములో ఊగేవారిగా, సర్వుల విఘ్నహర్తలుగా మరియు సర్వుల కష్టాన్ని సహజతరం చేసేవారిగా అవుతారు. నాదంటూ ఏమీ లేదు, అంతా బాబాదే. భారాన్ని తమపై పెట్టుకున్నప్పుడు అన్ని రకాల విఘ్నాలు వస్తాయి. నావి కావు అని అనుకుంటే నిర్విఘ్నముగా ఉంటారు.